
శుక్రవారం 31.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 100 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



మరో 15 ఏళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటే.. నవ్యాంధ్రలో స్వర్ణయుగం సాకారం అవుతుంది.సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది. రాష్ట్రంలో పలుమార్లు అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి 2లక్షల పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీదే.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



# పెట్టుబడులకు ఏపీ 'హాట్‌స్పాట్'

## రూ.5,700 కోట్ల ఇంధన ప్రాజెక్టులకు శ్రీకారం

### » బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌రాక్, టీపీజీ తదితర గ్లోబల్ సంస్థల ఆసక్తి: లోకేశ్

**కర్నూలు, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్):** గ్లోబల్ పెట్టుబడిదారుల దృష్టి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రీకృతమైందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో విశ్వసనీయత పునరుద్ధరణతో ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడి సంస్థలు, పునరుత్పాదక ఇంధన కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు.
కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరులో టాటా పవర్, సుజలాన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న రూ.5,700 కోట్ల విలువైన 800 మెగావాట్ల సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు గురువారం లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా సుమారు నాలుగు వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, బ్రూక్‌ఫీల్డ్, బ్లాక్‌స్టోన్, బ్లాక్‌రాక్, ఈక్విటీ, టీపీజీ వంటి గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ ఫండ్‌లు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. రెన్యూ, ప్రీమియర్ ఎనర్జీస్, ఏసీఎంఈ, వారీ తదితర ప్రముఖ పునరుత్పాదక ఇంధన సంస్థలు కూడా రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి చేసే స్వచ్ఛమైన ఇంధనాన్ని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్తామని అన్నారు.
అంతకుముందు ఆదోనిలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
'డోర్ టు డోర్' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో

మిగతా 2లో...





# ఫేక్ లేఖతో గందరగోళం

- మోదీ రాజీనామా చేసినట్లు వైరల్ అవుతున్న పోస్టులకు చెక్
- వ్యక్తిగత, ఆర్థిక వివరాలు పంచుకోవద్దని పీఐబీ హెచ్చరిక

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.
అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా సూచించింది పీఐబీ. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది.
వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

# ప్రజాసేవలోనే అసలైన సంతృప్తి

- ఎన్టీఆర్ ట్రస్ట్‌తో 29 ఏళ్లుగా ప్రజాసేవ
- కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే మా కుటుంబానికి బలం
- నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న భువనేశ్వరి





**కుప్పం(జర్నలిస్ట్ ఫైల్) :** ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో 29 ఏళ్లుగా తన ప్రయాణం ప్రజాసేవకే అంకితమైందని తెలిపారు. కుప్పం ప్రజలు తమ కుటుంబంపై చూపిస్తున్న ప్రేమాభిమానాలే తమకు కొండంత బలమని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, వినికిడి సమస్య ఉన్న పలువురికి మిషన్లు అందజేశారు.
**మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి:** కుప్పంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబం సంతోషంగా ఉండాలంటే అది

2 లో

# ఎల్‌నినోపై ముందస్తు అప్రమత్తత

- రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- సాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రత్యామ్నాయ చర్యలపై పవన్-నిమ్మల సమీక్ష



**అమరావతి, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్):** సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, పరిస్థితులను ప్రత్యక్షంగా వివరించి ప్రత్యామ్నాయ సాగు మార్గాలపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో గురువారం సమావేశమై రాష్ట్రంలోని నీటి పరిస్థితులు, సాగునీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహించారు.
సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులపై రైతుల్లో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులపైనా ఉందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి కొరత, ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించాలని సూచించారు. ప్రకృతి విపత్తుల కారణంగా రైతులు నష్టపోకుండా ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చేయించుకునేలా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

మిగతా 2లో...

మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

## పెన్షన్లకు భారీ నిధులు



- 62.07 లక్షల మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా
- ఆరు జిల్లాల్లో ముందస్తు పంపిణీ..
- మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న పంపిణీ

## నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



- ఈపీడీసీఎల్ అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు

**అమరావతి, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి

## విశాఖ రైల్వేస్టేషన్ విస్తరణ




- రూ.229 కోట్లతో కోచింగ్ యార్డ్ ఆధునీకరణ పనులు
- అదనంగా ఆరు ప్లాట్‌ఫామ్‌లు.. కొత్తగా ఆరు లైన్ల నిర్మాణం
- రద్దీ తగ్గించి రైళ్ల నిర్వహణకు వేగం




# ప్రతి చిన్నారికి ఆరోగ్య కవచం

## దేశంలో తొలిసారిగా రాష్ట్రస్థాయిలో ఆర్‌బీఎస్‌కే-2.0 ప్రారంభం

## వ్యాధులను ముందే గుర్తించి పూర్తిగా ఉచిత చికిత్స

**రంపచోడవరం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్):** చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి ఉచిత చికిత్స అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే-2.0)కు శ్రీకారం చుట్టింది. పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ముసురుమిల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ గురువారం రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో ప్రారంభించడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్‌బీఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే, ఐ స్క్రీనింగ్ స్టాళ్లను మంత్రి పరిశీలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

మిగతా 3లో...



## ముందే పింఛన్... వేగంగా అభివృద్ధి



- వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే పంపిణీ
- భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది: మంత్రి అచ్చెన్నాయుడు

2 లో


## డోర్ టు డోర్‌తో గెలుపు బాట



- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి
- పనిచేసే నాయకులకు ప్రాధాన్యం.. క్రమశిక్షణకు పెద్దపీట: నారా లోకేష్

# కామన్వెల్త్‌లో భారత్ దూకుడు

- అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్‌లో మూడు పతకాల పంట
- జావెలిన్ ఫైనల్‌కు నీరజ్, రోహిత్, యశ్వీర్ అర్హత



లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 8.09 మీటర్ల దూరం దూకి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

**గ్లాస్గో :** 23వ కామన్వెల్త్ క్రీడల్లో భారత అథ్లెట్లు అదరగొడుతున్నారు. అథ్లెటిక్స్‌లో మురళీ శ్రీశంకర్ రజత పతకం సాధించగా, పారా-అథ్లెటిక్స్‌లో దిలీప్ మహాదు గావిత్ స్వర్ణం, మహమ్మద్ బాసిల్ మొరసింగనకత్ రజతం సాధించి చరిత్ర సృష్టించారు. మరోవైపు భారత బాక్సర్లు కనీసం 10 పతకాలను ఖాయం చేసుకున్నారు. భారత స్టార్ లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ 8.09 మీటర్ల దూరం దూకి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. దీంతో కామన్వెల్త్ గేమ్స్ చరిత్రలో లాంగ్ జంప్‌లో వరుసగా రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా శ్రీశంకర్ రికార్డు సృష్టించాడు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లోనూ శ్రీశంకర్ రజత పతకం సాధించాడు. జమైకాకు చెందిన తాజే గేల్ 8.15 మీటర్ల దూరం దూకి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. స్కాట్లాండ్‌కు చెందిన స్టీఫెన్ మెకెంజీ 8.08 మీటర్ల ప్రదర్శనతో కాంస్య పతకం సాధించాడు. మరో భారత అథ్లెట్ లోకేష్ సత్యనాథన్ 7.97 మీటర్ల ఉత్తమ ప్రదర్శనతో ఐదో స్థానంలో నిలిచాడు.
**పారా-అథ్లెటిక్స్‌లో మరో రెండు... :** పారా-అథ్లెటిక్స్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు దక్కాయి.

మిగతా 2లో...

## పెట్టుబడులకు ఏపీ 'హాట్‌స్పాట్'



(మొదటి పేజీ తరువాయి)

సమర్థంగా నిర్వహించాలని ఆదేశించిన లోకేశ్, పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిని సహించబోమని హెచ్చరించారు. అంతర్గత సమస్యలను పార్టీ వేదికలపైనే చర్చించి పరిష్కరించుకోవాలని, మీడియా ముందుకు తీసుకెళ్లవద్దని సూచించారు. స్థానికంగా ఉన్న రెవెన్యూ, పోలీసు, జీ–రామ్–జీ, గత హౌసింగ్ బిల్లుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై ముందస్తు అప్రమత్తత



(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదని పేర్కొంటూ, కాలువల పూడికతీత, గట్ల లీకేజీల నివారణ, నీటి వృథా అరికట్టే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా, పిఠాపురం పరిసర ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రంగా ఉన్నందున అక్కడ ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా కాకినాడ జిల్లా పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట ప్రాంతాల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ప్రాజెక్టు నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు మంత్రి నిమ్మల రామానాయుడికి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఏలేరు ఆయకట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పరిశీలించనున్నట్లు మంత్రి వివరించారు.

సమావేశానికి ముందు భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న పవన్ కల్యాణ్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.

## పెన్షన్లకు భారీ నిధులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు విడుదల చేయగా.. 62 లక్షల మందికి లబ్ది చేకూరనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టుకు సంబంధించి 62,07,573 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించనున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో 11,98,044 మంది లబ్ధిదారులకు గురువారమే రూ. 514.42 కోట్ల పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.


రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న రూ. 2,198.31 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విడతలో 50,09,529 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ పెన్షన్ల కోసం రూ. 70,907.41 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయ పోస్టులను వాస్తవ పనిభారం ఆధారంగా పునఃలెక్కించాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు భారీ నిధులు విడుదల చేయగా.. 62 లక్షల మందికి లబ్ది చేకూరనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టుకు సంబంధించి 62,07,573 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించనున్నట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమం నేపథ్యంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్రలో 11,98,044 మంది లబ్ధిదారులకు గురువారమే రూ. 514.42 కోట్ల పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో ఆగస్టు 1న రూ. 2,198.31 కోట్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విడతలో 50,09,529 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ పెన్షన్ల కోసం రూ. 70,907.41 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీన లబ్ధిదారులకు పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిసిన నక్కా ఆనందబాబు, పత్తిపాటి పుల్లారావు



విజయనగరం, (జర్నలిస్ట్ ఫైల్): గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజును మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు గురువారం విజయనగరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం నేపథ్యంలో పలు అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు బాధ్యతలు నిర్వహించిన సమయంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాది పడిందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ కల నేడు సాకారమై విమానాశ్రయం ప్రారంభోత్సవం జరగడం రాష్ట్ర ప్రజలకు ఆనందదాయకమైన విషయమని అభిప్రాయపడ్డారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కీలక మౌలిక వసతిగా నిలవడంతో పాటు ఉత్తరాంధ్రలో పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి కొత్త అవకాశాలను తెరుస్తుందని పేర్కొన్నారు. అనంతరం నక్కా ఆనందబాబు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు శుభాకాంక్షలు తెలియజేసి కుశల ప్రశ్నలు అడిగారు.

# ప్రజాసేవలోనే అసలైన సంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

మహిళల చేతిలోనే ఉంటుందని చెప్పారు. ఏమీ తెలీదు.. చేయలేను అని భయపడకుండా ధైర్యంగా ముందడుగు వేస్తే మహిళలు అనుకున్న లక్ష్యాలను సాధించగలరని భువనేశ్వరి సూచించారు. చంద్రబాబు ప్రోత్సాహంతో తాను వ్యాపార రంగంలోకి అడుగుపెట్టానని భువనేశ్వరి తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక చేయూత కల్పించాలనే లక్ష్యంతో కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. కుప్పం మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ కల్పించేందుకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో 'స్త్రీ శక్తి హస్తకళా స్టోర్' ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడి విక్రయాల ద్వారా వచ్చే లాభాన్ని తిరిగి మహిళలకే అందిస్తున్నామని చెప్పారు.

**టీం వర్క్‌తోనే విజయం:** ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే సమష్టి కృషి, టీం వర్క్ ఎంతో కీలకమని భువనేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌కు దాతలు అందిస్తున్న సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు. చల్లపల్లి ఎన్టీఆర్ స్కూల్ తన హృదయానికి ఎంతో దగ్గరగా



ఉంటుందని చెప్పారు. ఆ స్కూల్ ద్వారా అనాథ పిల్లలకు విద్యను అందిస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉందన్నారు.

**కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ :** మొదట కుప్పం హెచ్‌పీ రోడ్డులోని శ్రీ సాయిబాబా ఆలయంలో భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపేటలోని శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు అన్వార్ బాషా, చిన్ని నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శాంతిపురం మండలం కడపల్లిలోని తన నివాసంలో భువనేశ్వరి స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా విన్న ఆమె, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలవడమే తమ కుటుంబం ఎప్పటి నుంచో పాటిస్తున్న సేవా స్ఫూర్తి అని పేర్కొన్నారు.

# ముందే పింఛన్... వేగంగా అభివృద్ధి

**కోటబొమ్మాళి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రెండు రోజుల ముందుగానే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం కన్నెవలస గ్రామంలో గురువారం లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పింఛన్లను అందజేసిన మంత్రి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి నెలా పారదర్శకంగా ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తోందని పేర్కొన్నారు.

అనంతరం జాతీయ రహదారి నుంచి కన్నెవలస గ్రామం వరకు, గ్రామంలోని అంతర్గత సీసీ రహదారులను రూ. 88 లక్షల వ్యయంతో నిర్మించిన పనులను మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం విమానాశ్రయం మైలురాయిగా నిలుస్తుందన్నారు. విమానాశ్రయం ద్వారా పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగి యువతకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 25 నెలల్లో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. గత ఐదేళ్ల పాలనలో అక్రమాలకు పెద్దపీట వేసి గ్రామాల అభివృద్ధిని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. నేడు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు



చేరేలా, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటికే లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఉత్తరాంధ్రను పరిశ్రమలు, ఉపాధికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేరడీ బ్యారేజ్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగి రూ. 641 కోట్ల నిధులు మంజూరయ్యాయని, బ్యారేజ్ పూర్తయితే జిల్లాలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. 2029 నాటికి గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేసి గ్రామాల రూపురేఖలు మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అనంతరం "ఇంటింటికి కూటమి ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా మంత్రి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా వివరించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, పేద కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ విధ్వంసకర పాలనకు ముగింపు పలికి అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కొత్త దిశానిర్దేశం చేసిందన్నారు. గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తమకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రజలకు చేరువగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరి ప్రసాద్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారి ఎం. సుధాకర్‌రావు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కామన్వెల్త్‌లో భారత్ దూకుడు

(మొదటి పేజీ తరువాయి)

పురుషుల 100మీ. టి47 విభాగంలో దిలీప్ మహాదు గావిత్ 10.71 సెకన్లతో కొత్త గేమ్స్ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. అదే ఈవెంట్‌లో భారత మరో అథ్లెట్ మహమ్మద్ బాసిల్ మొరసింగనకత్ 10.83 సెకన్లతో రజత పతకం సాధించాడు. దీంతో భారత్ స్వర్ణం, రజతం రెండింటినీ సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది. పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఖాతాలో మూడో స్వర్ణ పతకం చేరింది. ఇంతకుముందు మీరాబాయి చాను(వెయిట్‌లిఫ్టింగ్), షర్మిలా ధాకా (షాట్‌పుట్ ఎఫ్57)లో స్వర్ణాలు సాధించారు. ఈ పతకాలతో భారత్ మొత్తం 15 పతకాలకు చేరుకుంది. ఇందులో 3 స్వర్ణాలు, 9 రజతాలు, 3 కాంస్యాలు ఉన్నాయి. పతకాల పట్టికలో భారత్ ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో ఉంది.

**జావెలిన్ త్రో ఫైనల్‌కు ముగ్గురు... :** జావెలిన్ త్రో ఫైనల్లోకి భారత్‌కు చెందిన ముగ్గురు అథ్లెట్లు బెర్త్ సంపాదించారు. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ఫైనల్లోకి ప్రవేశించారు. నీరజ్ చివరి త్రోను 79.61మీ. విసరగా.. రోహిత్, యశ్ వీర్ కూడా ఫైనల్ అర్హత మార్క్‌ను అందుకున్నారు. అయితే, నీరజ్‌కు గట్టి పోటీనిచ్చే ప్రత్యర్థిగా పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఉన్నాడు. ఇతను 2022 క్రీడల్లో స్వర్ణం గెలవడమే కాకుండా, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో చోప్రాను అధిగమించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వీరిద్దరితో పాటు శ్రీలంకకు చెందిన రుమేష్ పతిరాగే పతక పోటీలో ఉన్నాడు. అతను క్వాలిఫికేషన్ రౌండ్‌లో 92.62 మీటర్ల త్రోతో ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శన రికార్డును తన పేరిట కలిగి ఉన్నాడు.

**బాక్సింగ్‌లో 10 పతకాలు ఖాయం :** బాక్సింగ్ రింగ్‌లో భారత బాక్సర్లు సత్తా చాటుతున్నారు. మొత్తం 10మంది బాక్సర్లు సెమీఫైనల్స్‌కు చేరుకోవడంతో మరో 10 పతకాలు ఖాయమయ్యాయి. సాక్షి చౌదరి (51 కేజీలు), అరుంధతి చౌదరి (70 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), అంకుష్ పంఘల్ (80 కేజీలు), నరీందర్ బర్వాల్ (ం90 కేజీలు), ప్రపంచ ఛాంపియన్ జాస్మిన్ లంబోరియా (57 కేజీలు) సెమీఫైనల్ బెర్తులు సాధించారు. వీరిలో లవ్లీనా బోర్గోహైన్ (75 కేజీలు), ప్రియా ఘంఘాస్ (60 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జదుమణి సింగ్ (55 కేజీలు) కూడా సెమీఫైనల్స్‌కు చేరారు. రోజు చివరి బౌట్‌లో జాస్మిన్ లంబోరియా ఇంగ్లాండ్‌కు చెందిన ఎలిస్ గ్లిన్‌పై 4–1 తేడాతో విజయం సాధించి 57 కేజీల సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. దీంతో 2022 బర్మింగ్‌హామ్ గేమ్స్‌లో భారత్ సాధించిన ఏడు బాక్సింగ్ పతకాల రికార్డు కూడా ఈసారి బ్రేక్ కానుంది.

**అథ్లెటిక్స్‌లోనూ ఫైనల్ బెర్తులు :** పురుషుల 400మీ. హర్డిల్స్‌లో యశస్ పలక్ష, సంతోష్ కె. తమిళరసన్ ఫైనల్‌కు అర్హత సాధించారు. సంతోష్ రెండో హీట్‌లో 49.51 సెకన్లతో మూడో స్థానంలో నిలవగా, యశస్ మొదటి హీట్‌లో 49.65 సెకన్లతో మూడో స్థానంలో నిలిచాడు. పురుషుల షాట్‌పుట్‌లో జాతీయ రికార్డు హోల్డర్లు తేజిందర్‌పాల్ సింగ్ తూర్, సమర్‌దీప్ సింగ్ గిల్ కూడా ఫైనల్‌కు చేరారు. తూర్ 20.14 మీటర్ల దూరం విసరగా, గిల్ 19.95 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. 200మీ. పరుగులో జాతీయ రికార్డు హోల్డర్ అనిమేష్ కుజుర్ కూడా సెమీఫైనల్‌కు చేరాడు. 20.46 సెకన్లతో తన హీట్‌లో విజయం సాధించి ఓవరాల్‌గా ఏడో స్థానంలో నిలిచాడు.

**వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్‌లో నిరాశ :** అయితే వెయిట్‌లిఫ్టింగ్, స్విమ్మింగ్‌లో భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. మహిళల 77 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో సంజన పోటీని పూర్తి చేయలేకపోయింది. స్విమ్మింగ్‌లో పురుషుల 200మీ. ఫ్రీస్టైల్ ఫైనల్‌కు సాజన్ ప్రకాష్, అనీష్ ఎస్. గౌడ అర్హత సాధించలేకపోయారు. సాజన్ తన హీట్‌లో ఐదో స్థానంలో, ఓవరాల్‌గా 20వ స్థానంలో నిలిచాడు. అనీష్ 1:51.64 సమయంతో ఓవరాల్‌గా 18వ స్థానంలో నిలిచాడు.

## డోర్ టు డోర్‌తో గెలుపు బాట



**ఆదోని(జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆదోని పట్టణ, మండల టిడిపి నేతలు పని చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ కోరారు. ఆదోని మండల, పట్టణ టిడిపి ముఖ్యనేతలతో నారా లోకేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... చిన్నచిన్న విభేదాలను పక్కనబెట్టి కూటమి నేతలు, కార్యకర్తలను కలుపుకెళ్లాలని అన్నారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ విజయాలపై డోర్ టు డోర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించండి. మండల, క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు చురుగ్గా పనిచేయాలి. పనిచేసే వాళ్ళని గౌరవిస్తా. పార్టీ లైన్ దాటి ఎవరైనా మాట్లాడితే సహించేది లేదు. ఏవైనా సమస్యలు ఉంటే ఇంచార్జితో మాట్లాడండి. నాలుగు గోడల నడుమ కలసి కూర్చొని సమస్య పరిష్కరించుకోండి. మీడియాకి ఎక్కితే పార్టీ నష్టపోతుంది. రెవెన్యూ, పోలీసు సమస్యలు, జీ రామ్ జీ బిల్లుల సమస్యలపై అధికారులకు ఆదేశాలు ఇస్తాం. 2014–19 నడుమ హౌసింగ్ బిల్లుల సమస్యపై ముఖ్యమంత్రితో మాట్లాడి, విడతలవారీగా చెల్లించేలా కృషిచేస్తా. కూటమి ధర్మాన్ని పాటిస్తూ కలసికట్టుగా పని చేయాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో జోనల్ ఇంచార్జి పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి, పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలు కిస్టమ్మ, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కేశవరెడ్డి, ఆదోని పట్టణ పార్టీ అధ్యక్షుడు బి. తిమ్మప్ప, మండల పార్టీ అధ్యక్షుడు కురువ శివప్ప, జిల్లా పార్టీ ట్రెజరర్ వాల్మీకి రవి, ఆదోని టీడీపీ నాయకులు బి. కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, బి. విరూపాక్షి, సజ్జాద్ హుసేన్, కొల్లా వీరేష్, రామాంజని, ఎస్. సయ్యదుల్లా, బిపి బస్వరాజ్, కురువ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ అధికారులతో గురువారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షా సమావేశంలో విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

విమానాశ్రయం ప్రారంభోత్సవ సమయంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా అన్ని ఫీడర్లు, సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాకప్ వ్యవస్థలను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి 24 గంటల పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**పీఎం సూర్యఘర్, కుసుమ్ పనులు వేగవంతం చేయాలి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్–ఎస్ పథకాల పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల డిస్కంపై రూ. 100 కోట్లకు పైగా ఆర్థిక భారం తగ్గిందని వివరించారు.

విద్యుత్ నష్టాల నివారణకు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు.

**పుష్కరాల నాటికి విద్యుత్ మౌలిక సదుపాయాలు పూర్తి :** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మార్చి 2027 నాటికి పుష్కరాలకు అవసరమైన అన్ని విద్యుత్ మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నాటికి కొత్తగా 19 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

**వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు వేగవంతం :** పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇప్పటికే కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. గత ఏడాదిలో సుమారు 12వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు.

**దళారులను నమ్మొద్దని హెచ్చరిక :** విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. విద్యుత్ శాఖలో నియామకాలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు శాఖ పరిధిలో 450 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.

## విశాఖ రైల్వేస్టేషన్ విస్తరణ

**దిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో అత్యధిక రద్దీతో కూడిన రైల్వేస్టేషన్లలో ఒకటైన విశాఖపట్నంలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపరచడానికి రూ. 229 కోట్లు కేటాయిస్తున్నట్లు రైల్వేశాఖ వెల్లడించింది. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ నిధులతో విశాఖపట్నం కోచింగ్ యార్డ్‌ను ఆధునీకరిస్తారు. అదనపు లైన్లు, ప్లాట్‌ఫామ్‌లు నిర్మిస్తారు. ఈ స్టేషన్‌నుంచి రోజువారీగా నడుస్తున్న 113 రైళ్ల ద్వారా 80వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఇప్పుడున్న కోచింగ్ యార్డ్ స్వరూపం వల్ల ప్లాట్‌ఫామ్‌ల లభ్యత తగ్గుతోంది. దానివల్ల నిర్వహణాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైళ్ల క్రాసింగ్‌కు తగిన స్థలం లేక సిగ్నళ్ల దగ్గర ఎక్కువ సమయం నిలిపేయాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు యార్డ్ స్వరూపాన్ని సంపూర్ణంగా పునరుద్ధరించే పనులు మొదలుపెడుతున్నారు. ఇందులో భాగంగా లూప్‌లైన్‌లు తొలగిస్తారు. ఇప్పుడున్న ప్లాట్‌ఫామ్‌లను విస్తరిస్తారు. మరో ఆరు ప్లాట్‌ఫామ్‌లు అదనంగా నిర్మించి ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తారు. కొత్తగా ఆరు రైల్వేలైన్లుకూడా నిర్మిస్తారు. విస్తరించిన ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికులు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంపులు, లిఫ్ట్‌లు, ఎస్కలేటర్లు ఏర్పాటుచేస్తారు.

# కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి: సీఐటీయూ

- **రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** షెడ్యూల్డ్ రంగాల్లో పనిచేస్తున్న సుమారు 50 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాన్ని నెలకు రూ. 26 వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు, విశ్వవిద్యాలయాలు, దేవాలయాలు, ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న నాలుగు లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) అమలు చేసి రెగ్యులర్ చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం



రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ ఆందోళనల్లో వేలాది మంది కార్మికులు పాల్గొన్నట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సి. హెచ్. నరసింగరావు, ప్రధాన కార్యదర్శి ఏ. వి. నాగేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా కనీస వేతనాలను సవరించలేదని, వెంటనే కార్మిక శాఖ ద్వారా వేతనాలను సవరించి రూ. 26 వేలకు పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరింది. ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు, సమగ్ర శిక్ష, జాతీయ ఆరోగ్య మిషన్, ఉపాధి హామీ, ఆరోగ్యశ్రీ, 104, 108, సామాజిక సంక్షేమ, బీసీ, గిరిజన సంక్షేమ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, టీటీడీ తదితర సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో అమలైన ఎంటీఎస్‌ను పునరుద్ధరించాలని, ఎన్నికల హామీల ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరింది.

ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస వేతనాల పెంపు, ఎంటీఎస్ అమలు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలతో కలిసి మరింత విస్తృత స్థాయిలో ఉద్యమాలు చేపడతామని సీఐటీయూ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. కార్మికుల సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని, కార్మికుల శ్రమే అభివృద్ధికి పునాదని నాయకులు పేర్కొన్నారు.

# ఎన్ఆర్ఐఐటీ పాలిటెక్నిక్‌లో నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

**విశాదల, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్):** విశాదలలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఆర్ఐఐటీ) పాలిటెక్నిక్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు. గుంటూరుకు చెందిన తలసేమియా నీడ్స్ బ్లడ్ సెంటర్ సహకారంతో కళాశాల ఈ-బ్లాక్ సెమినార్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం జరగనుంది.

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కళాశాల యాజమాన్యం పిలుపునిచ్చింది.

ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, ప్రిన్సిపాల్ సంజయ్ హాజరై రక్తదాతలను అభినందించనున్నారు. "ఒక్క యూనిట్ రక్తదానం.. అనేక ప్రాణాలకు జీవదానం" అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమానికి స్వచ్ఛంద రక్తదాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా చిన్నారికి రూ.4.72 లక్షల వైద్యసాయం



- **వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**

**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):** చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన చిన్నారి చుండూరు సుహాన్స్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ. 4,72,885 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) మంజూరైంది. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చిన్నారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుహాన్స్ వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే ప్రత్యేక సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి దరఖాస్తు పంపగా, ప్రభుత్వం రూ. 4.72 లక్షల వైద్య సహాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, అత్యవసర వైద్య చికిత్సల సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. వేమూరు నియోజకవర్గంలోని ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. చిన్నారి సుహాన్స్ త్వరగా కోలుకుని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రభుత్వం, అలాగే తమకు వైద్యసాయం అందించేందుకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎఐ యుగంలో ప్రతి విద్యార్థి ఆర్థిక శాస్త్రం నేర్చుకోవాలి: రవికుమార్ గోగులముడి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కృత్రిమ మేధస్సు (ఎఐ) వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి ఆర్థిక శాస్త్రంపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమని కెఎల్ యూనివర్సిటీ బీఏ (ఐఏఎస్) విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్ గోగులముడి పేర్కొన్నారు. ఈ అంశంపై విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, వనరుల వినియోగం, ప్రభుత్వ విధానాల ప్రభావం, వ్యక్తులు, సంస్థలు, దేశాలు తీసుకునే ఆర్థిక నిర్ణయాలను అర్థం చేసుకోవడానికి ఆర్థిక శాస్త్రం కీలకమని తెలిపారు. పదేళ్లకు పైగా ఈ అంశాన్ని బోధించిన అనుభవంతో నేటి పరిస్థితుల్లో గతంతో పోలిస్తే ఆర్థిక శాస్త్రం మరింత ప్రాధాన్యం సంతరించుకుందని అన్నారు. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్బీఐ, నాబార్డ్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, బ్యాంకింగ్ నియామక పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షల్లో ఆర్థిక శాస్త్రానికి విశేష ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక భావనలు, ద్రవ్య విధానం, ఆర్థిక వ్యవస్థపై పట్టు ఉంటే పోటీ పరీక్షల్లోనే కాకుండా ఉన్నత విద్య, మేనేజ్‌మెంట్ కోర్సుల్లోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎఐ, జనరేటివ్ ఎఐ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికతల అభివృద్ధితో ఉద్యోగ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని, డేటా నేటి ఆర్థిక వ్యవస్థలో కీలక వనరుగా మారిందన్నారు. సాంకేతిక పరిణామాల వల్ల ఉద్యోగాల స్వరూపం, అవసరమైన నైపుణ్యాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఎఐ యుగంలో పోటీని తట్టుకుని విజయవంతమైన వృత్తి జీవితాన్ని నిర్మించుకోవాలంటే ప్రతి విద్యార్థి ఆర్థిక శాస్త్రంపై బలమైన పట్టు సాధించాలని రవికుమార్ గోగులముడి సూచించారు.

# ప్రజాకవి వేములపల్లి శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఘన నివాళి



- **అర్పించిన ప్రజానాట్యమండలి!**

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు వేములపల్లి శ్రీకృష్ణ జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పలువురు సాహితీవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, తెలుగు సాహిత్యం, సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, "చేయెత్తి జై కొట్టు తెలుగోడా" వంటి చిరస్మరణీయ గీతాన్ని రచించిన వేములపల్లి శ్రీకృష్ణ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని, దేశభక్తిని తన రచనల ద్వారా ప్రజల్లో నింపారని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా చైతన్యం కోసం ఆయన చేసిన కృషి నేటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తెలుగు భాష, సాహిత్యం, ప్రజాసేవకు ఆయన అందించిన సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. యువత వేములపల్లి శ్రీకృష్ణ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ మాస్టారు, సింగారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి ఆరోగ్య కవచం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో చదువుతున్న 62.65 లక్షల మంది చిన్నారులకు ఈ ఏడాది సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరిలో 20.95 లక్షల మంది అంగన్‌వాడీ చిన్నారులు, 41.70 లక్షల మంది పాఠశాల విద్యార్థులు ఉన్నారని చెప్పారు.

పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, శారీరక-మానసిక ఎదుగుదల సమస్యలతో పాటు మొత్తం 38 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించేలా పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా తొలిసారిగా అధిక రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, మూత్రపిండాల సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలు, సెల్‌ఫోన్ అధిక వినియోగం, నిద్రలేమి వంటి అంశాలపై కూడా వివరాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్య పరీక్షల్లో సమస్యలు గుర్తించిన పిల్లలకు సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా స్థాయి బాలల చికిత్స కేంద్రాలు, అవసరమైతే ఉన్నత వైద్య సంస్థల్లో పూర్తిగా ఉచిత చికిత్స అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. వ్యాధిని గుర్తించడమే కాకుండా చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి చిన్నారిని పర్యవేక్షించే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 34 జిల్లా బాలల చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయని, గత రెండేళ్లలో 4.85 లక్షల మంది చిన్నారులకు వైద్య సేవలు అందించామని చెప్పారు. ఇదే కాలంలో 3,214 శస్త్రచికిత్సలు నిర్వహించడంతో పాటు బాలల ఆరోగ్య కార్యక్రమాల కోసం రూ. 25.78 కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు.

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 43.30 లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, చూపు సమస్యలు ఉన్న 2.50 లక్షల మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 7 కోట్లు కేటాయించిందన్నారు. కంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా విద్యార్థులు చదువులో వెనుకబడకుండా చూడడమే లక్ష్యమన్నారు.

కిశోర దశలో ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యలపై అవగాహన పెంచేందుకు రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,317 కిశోర మైత్రి ఆరోగ్య కేంద్రాలు, 61,556 మంది తోటి విద్యార్థి మార్గదర్శకులు సేవలందిస్తున్నారని వెల్లడించారు. మానసిక ఆరోగ్య సమస్యలను దాచిపెట్టకుండా వైద్యులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

పిల్లల ఆరోగ్యమే రాష్ట్ర భవిష్యత్తుకు పునాదని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జీరో వేకెన్సీ విధానంతో గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయని చెప్పారు.



కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ జె. విజయలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర కోఆర్డినేటర్ డా. సుబ్రహ్మణ్యం, ఆర్‌కేఎస్‌కే రాష్ట్ర కోఆర్డినేటర్ డా. నిర్మల గ్లోరి, పోలవరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి. సరిత, ఎమ్మెల్యే మిరియాల శిరీష, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సేవలను మంత్రి అభినందించారు.

# మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం మంగళగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు పిలుపునిచ్చారు.



కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ టి. భవాని మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణాకు ఎక్కువగా బాలికలు, చిన్నారులే బలవుతున్నారని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రుల సూచనలు పాటించాలని, అపరిచితులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకూడదని సూచించారు.

మంగళగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూష మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పు అయినప్పటికీ దీనిపై చాలా మందికి సరైన అవగాహన లేదన్నారు. ఈ అంశంపై అవగాహన పొందిన వారు సోషల్ మీడియా ద్వారా మరింత మందికి చేరవేసి ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు.

నిర్మల కళాశాల చైర్మన్ వి. వెంకట ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగాలు, అధిక ఆదాయం, మంచి జీవితం పేరుతో ఆశలు చూపించి ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మనుషులను తరలించడమే మానవ అక్రమ రవాణా అని వివరించారు. ఈ నేరం ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న, వెనుకబడిన దేశాల్లో ఎక్కువగా జరుగుతోందని, అక్రమ రవాణాకు గురైన వారితో చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలనే నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నారు.

గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ మెర్సీ జార్జి మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణాదారులు దూర ప్రాంతాల్లో కాకుండా మన చుట్టూ ఉన్న వారిలోనే ఉంటారని, ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని సహాయం చేస్తున్నట్లు నటిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.

చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సిస్టర్ విద్యా మాట్లాడుతూ, అక్రమ రవాణాకు కేవలం బాలికలే కాకుండా బాలురు కూడా బలవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మానవ అక్రమ రవాణాకు గురవుతున్నట్లు గమనిస్తే వెంటనే 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 112 (అత్యవసర సేవలు), 100 (పోలీసు) టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందించి బాధితులను రక్షించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి కోర్టు న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, గమన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పి. గిరిజ, మారుతి మహిళా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ జె. గంగా భవాని, వెలుగు ప్రాజెక్ట్ ఏపీఎం సాయి లీలా, నిర్మల కళాశాల విద్యార్థులు, సచివాలయ మహిళా పోలీసు సిబ్బంది, సిటీ ఛానల్ ప్రతినిధి రూఫస్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు ఆందోళనకరం

- **వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి**

**తాడేపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులపై దాడులు పెరిగాయని ఆరోపించారు. తాజాగా చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండలం మోటుమల్లెల గ్రామ వీఆర్వో దామోదరంపై టీడీపీ నాయకుడు సుందరం దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో భూ రికార్డులపై మాట్లాడుతున్న సమయంలో జరిగిన ఈ దాడిలో వీఆర్వోకు తీవ్ర గాయాలయ్యాయని, మూడు దంతాలు ఊడిపోయాయని పేర్కొన్నారు. ఘటనపై తహసీల్దార్ ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు గౌరవం, రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అధికార పార్టీ నాయకుల దాడులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులపై జరిగే దాడులకు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని నలమారు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

# ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు



- **రూ.25 లక్షల చెక్కు అందించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక రైలుపేటలోని శ్రీ అంజనేయస్వామి దేవస్థానం పునరుద్ధరణ నిమిత్తం దాతలు అందజేసిన రూ. 25 లక్షల చెక్కును ఆలయ ఈవో వై నరేష్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ వేదాంతం శ్రీనివాస శర్మకు ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ప్రతి ఆలయానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని, కొన్ని పునర్నిస్తున్నామని చెప్పారు. ఆలయాల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల సమగ్ర అభివృద్ధి, ధార్మిక పరిరక్షణ, భక్తులకు మౌలిక వసతుల కల్పన దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 360కి పైగా ఆలయాల పునర్నిర్మాణం, ధూపదీప నైవేద్యాలు, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం రూ. 500 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

# సీజీహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్లకు ఘన సన్మానం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్ఎస్) గుంటూరు వెల్‌నెస్ సెంటర్‌లో సీనియర్ మెడికల్ ఆఫీసర్లుగా సేవలందిస్తున్న డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ చీఫ్ మెడికల్ ఆఫీసర్లుగా (సీఎంఓ) పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సీజీహెచ్ఎస్ మాజీ సీఎంఓ, రిటైర్డ్ అధికారి డాక్టర్ టి.సీహెచ్. కోటేశ్వరరావు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.





ఈ సందర్భంగా డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఒకే వెల్‌నెస్ సెంటర్‌లో ఇద్దరు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు సేవలందించడం అరుదైన విషయమని పేర్కొన్నారు. ఇద్దరూ సమన్వయంతో పనిచేసి గుంటూరు సీజీహెచ్ఎస్‌ను సేవల పరంగా ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దాలని, ఉద్యోగులు, పెన్షనర్లలో సీజీహెచ్ఎస్‌పై మరింత విశ్వాసం పెంచేలా సేవలందించాలని సూచించారు. ఎంపానెల్డ్ ఆసుపత్రులతో సమన్వయం పెంచి ప్రతి లబ్ధిదారునికి మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని కోరారు.

డాక్టర్ కొండా నాగార్జున, డాక్టర్ దాసరి రమేష్ మాట్లాడుతూ, ప్రతిరోజూ అధిక సంఖ్యలో లబ్ధిదారులు వచ్చినప్పటికీ ఓర్పు, సహనంతో సేవలందిస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ వైద్యుల సలహాలు, సూచనలు తమకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.

కార్యక్రమంలో లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు కట్టా వెంకటేశ్వర్లు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ హేమసుందరి, ఫార్మాసిస్టులు లక్ష్మీ కౌసల్య, సునీల్, వైద్య సిబ్బంది పేరేశ్వరరావు, మురళి, రామారావు పాల్గొన్నారు.

# మహిళా ఎస్సై పై వైసీపీ నేతల దాడి హేయం, బాధ్యులను కఠినంగా శిక్షించాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విధి నిర్వహణలో ఉన్న మహిళా ఎస్సై ప్రవల్లికపై వైసీపీ నాయకులు చేసిన దాడి, అనుచిత ప్రవర్తనను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి తీవ్రంగా ఖండించారు. చట్టాన్ని అమలు చేసే పోలీసు అధికారిపైనే చేతులు వేసి ఇబ్బందులకు గురిచేయడం అత్యంత హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళా ఎస్సైపై జరిగిన దాడి కేవలం ఒక పోలీసు అధికారిపైనే కాకుండా చట్టవ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు. విధుల్లో ఉన్న మహిళా అధికారి పై వైసీపీ నేతలు వ్యవహరించిన తీరు పూర్తిగా అనుచితమైందని, మహిళల పట్ల వారి వైఖరిని బయటపెడుతోందని విమర్శించారు.

మహిళల గౌరవం, భద్రత గురించి మాట్లాడే వైసీపీ నాయకత్వం ఈ ఘటనపై సమాధానం చెప్పాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు. మహిళా ఎస్సైపై చేతులు వేసి, విధులకు ఆటంకం కలిగించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని అన్నారు.

జగన్ రెడ్డి ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా నిలవాల్సిన జగన్ మోహన్ రెడ్డి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని పరామర్శించడం విచారకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ ప్రభావంతో ఎవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు.

మహిళల భద్రత, గౌరవం విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాల్సిందేనని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

# పేదలకు ఉచిత వైద్య సేవలు



- **సంరక్ష హెల్పింగ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో గత మూడు సంవత్సరాలుగా స్థానిక పేద ప్రజలకు సంరక్ష హెల్పింగ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షమీరా తెలిపారు.

సంరక్ష హెల్పింగ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ షమీరా ఆధ్వర్యంలో, గుంటూరు జిల్లా మందడం హాసిని మల్టీ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి డాక్టర్ రహీం భాష నేతృత్వంలో మంగళగిరి 29వ వార్డు టిప్పర్ల బజార్‌లోని అంజుమన్ షాదీఖానాలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు డైరెక్టర్ తమ్మిశెట్టి జానకి దేవి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.డి. ఇబ్రహీం, మంగళగిరి పట్టణ టీడీపీ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ టీడీపీ కార్యదర్శి ఎస్.కె. రియాజ్, మంగళగిరి రూరల్ మైనార్టీ అధ్యక్షులు ఎస్.కె. నజీర్, మంగళగిరి ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్.కె. మాలిక్ బాబు తదితరులు హాజరయ్యారు. ముందుగా అతిథులకు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జిక్రియ, ఎస్.కె. బాజీ, ఎం. కృష్ణ, ఎస్.కె. అబ్దుల్ కరీం, ఎస్.కె. కాజా మొహిద్దీన్, ఎస్.కె. హనీషా, ఎస్.కె. బాబు జిలాని తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసు.. మాజీ ఎమ్మెల్యే ముస్తాఫా ఇంటికి పోలీసులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** నూజివీడుకు చెందిన పొగాకు వ్యాపారి కిడ్నాప్ కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ముస్తాఫా నివాసానికి పోలీసులు వెళ్లారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం వైసీపీ మాజీ ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తాఫా, ఆయన కుమారుడు బషీర్‌పై పోలీసులు కిడ్నాప్, క్రిమినల్ బెదిరింపుల కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో ప్రమేయం మరో ఐదుగురిని ఇప్పటికే అరెస్ట్ చేశారు. ముస్తాఫాతో పాటు ఆయన కుమారుడిని విచారించేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నాయి. అయితే వారి పరారీలో ఉండటంతో గాలిస్తున్నారు. ఇందులో భాగంగా ముస్తాఫా ఇంటికి పోలీసులు వెళ్లారు. వాళ్ల లేకపోవడంతో భార్యతో మాట్లాడారు. నూజివీడు వ్యాపారి కిడ్నాప్‌నకు వినియోగించిన కారును సీజ్ చేయాలని సూచించారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ సమయంలో ముస్తాఫా ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసీపీ నేతలు, కార్యకర్తలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

## బీసీ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

– మునిసిపల్ అధికారులతో సమీక్షలో బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్



మిర్యాలగూడ జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : మిర్యాలగూడ మునిసిపల్ పరిధిలో వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల తీరును రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బుధవారం మిర్యాల గూడలోని ఎన్ఎస్పీ అతిథి గృహంలో మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తిరుమలగిరి సురేందర్ మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో ఐదు రూపాయలకే భోజనం అందించే పథకం అమలు జరుగుతుందా లేదా అని అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా బీసీల సంక్షేమానికి సంబంధించిన పథకాలు మునిసిపల్ పరిధిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బీసీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మహిళా శక్తి క్యాంటీన్‌లో ఎంతమంది బీసీలకు ఉపాధి అవకాశాలు కల్పించారనే వివరాలను కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు. తొలుత రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్‌కు ఆర్డీఓ ఎస్. రమణారెడ్డి, డీఏఓ, తహసీల్దార్ శ్రీనివాస్ శర్మ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సంజీవ్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇస్తేరా స్వాగతం పలికారు.

## గౌతమి పాఠశాలలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం


– మహిళలు, బాలికల భద్రతే తెలంగాణ పోలీసుల లక్ష్యం

– అడిషనల్ ఎస్పీ రమేష్




నల్లగొండ, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : పట్టణంలోని గౌతమి ఇంగ్లీష్ స్కూల్‌లో షీ టీం ఆధ్వర్యంలో 'పోలీస్ అక్క' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సైబర్ వేధింపులు, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వేధింపులు ఎదురైతే వెంటనే షీ టీం లేదా పోలీసులను సంప్రదించాలని, బాధితుల వివరాలు గోప్యంగా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అపరిచితుల కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంజుల, భరోసా కేంద్రం ఎస్ఐ అమ్రీన్, రూరల్ ఎస్ఐ శివకుమార్, షీ టీం ఎస్ఐ గౌస్, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


## గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (BLR) మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట శ్రీ సాయిబాబా స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ సాయిబాబా స్వామిని ప్రార్థించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గురుపౌర్ణమి పర్వదినం ఆధ్యాత్మికతకు, గురువుల గొప్పతనాన్ని స్మరించుకునే పవిత్రమైన రోజని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మబద్ధమైన జీవనాన్ని సాగిస్తూ ఆధ్యాత్మిక విలువలను పాటించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్, మేడ మహేందర్ రెడ్డి, లక్ష్మణ్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం.. ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

- భూమిలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరింపులు.. రాజీ కోసం ఒత్తిడి తెచ్చారని ఆరోపణ
- తనపై, కుటుంబ సభ్యులపై అక్రమంగా కేసు నమోదు చేశారని ఫిర్యాదు..
- సీసీటీవీ ఫుటేజీ పరిశీలించాలని వినతి



మిర్యాలగూడ, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : సివిల్ కోర్టులో ఆస్తి వివాదం పెండింగ్‌లో ఉండగా మిర్యాలగూడ 2 టౌన్ ఎస్ఐ మేడబోయిన ఆంజనేయులు సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని తనను, తన కుటుంబ సభ్యులను బెదిరించి రాజీకి ఒత్తిడి తెచ్చారని ఆరోపిస్తూ దాసరాజు పద్మ కుమారుడు దాసరాజు శ్యాంసుందర్ నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్కు ఫిర్యాదు చేశారు. సివిల్ వివాదానికి సంబంధించి కోర్టులో కేసు విచారణలో ఉన్నప్పటికీ పోలీసులు ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. మిర్యాలగూడ పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 945లో ఉన్న భూమికి సంబంధించి తనకు, ప్రతివాదులకు మధ్య ఆస్తి వివాదం కొనసాగుతోందని, ఈ విషయంపై మిర్యాలగూడ సివిల్ కోర్టులో ఏ.ఎ. చీశీ.20/2026 కేసు ప్రస్తుతం విచారణలో ఉందని తెలిపారు. భూమి హక్కులు, యాజమాన్యం, స్వాధీనానికి సంబంధించిన అంశాలను సివిల్ కోర్టు పరిధిలోనే పరిష్కరించాల్సి ఉండగా, పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకున్నారని ఆరోపించారు. తమ భూమిలోకి ఎలాంటి చట్టబద్ధమైన అనుమతి లేకుండా ప్రవేశించి, తనను మరియు కుటుంబ సభ్యులను తీవ్ర పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు గురిచేసి అవమానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా రాజీకి ఒప్పించేందుకు ఒత్తిడి తెచ్చి, తనపై జతీఅఎవ చీశీ.216/2026, తేదీ 23-07-2026న కేసు నమోదు చేశారని ఆరోపించారు. రాత్రివేళ తనను, కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి గంటల తరబడి నిలబెట్టి మానసిక వేదనకు, అవమానానికి గురిచేశారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్పీని కోరారు. సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో పోలీసుల జోక్యంపై విచారణ జరిపి,

# ఎబిడిఎం కింద మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి ఎంపిక..

- జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్ షాప్‌ను ప్రారంభించిన కలెక్టర్.
- హాజరైన రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్,మిషన్ డైరెక్టర్
- రాష్ట్ర ఎబిడిఎం మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్యనారాయణ ఐఎఎస్.





యాదాద్రి భువనగిరి, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్మాత్మక చేపట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కింద తెలంగాణ రాష్ట్రం లో తొలి మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపికైన సందర్భంగా, బుధవారం రోజు జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎబిడిఎం మోడల్ జిల్లా ప్రారంభోత్సవ వర్క్‌షాప్ ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సాంప్రదాయ బద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ఘనంగా ప్రారంభించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గేయం "జయ జయహే తెలంగాణ" ఆలాపనతో కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. అనంతరం రాష్ట్ర ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, మిషన్ డైరెక్టర్, రాష్ట్ర ఎబిడిఎం మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్య నారాయణ ఐఎఎస్ వర్క్‌షాప్‌ను ప్రారంభించగా, నేషనల్ హెల్త్ అథారిటీ డైరెక్టర్ డా. పంకజ్ కుమార్ అరోరా వర్చువల్ ద్వారా పాల్గొని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రాము ఖ్యత పై కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మిషన్ డైరెక్టర్ డా. సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి భువనగిరి జిల్లాను తొలి ఏబీడీఎం మోడల్ జిల్లాగా ఎంపిక చేయడం అభి నందనీయమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆరోగ్య సంస్థలు 100 శాతం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు కట్టుబడి పని చేయాలని సూచించారు. ప్రతి రోగికి సంబం ధించిన ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేయడం ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వారి వైద్య చరిత్రను సులభంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి పౌరునికి ఆధార్ కార్డు ఎంత ముఖ్యమో, అదే విధంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడీ కూడా అంతే ముఖ్యమని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య సంస్థలు సమిష్టిగా కృషి చేసి ఏబీడీఎంను విజయ వంతంగా అమలు చేసి తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ, హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ నమోదులను విజయ వంతంగా పూర్తి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. రాబోయే మూడు నెలలకు సంబంధించిన కార్యా చరణ ప్రణాళికను సమర్థ వంతంగా అమలు చేసి ప్రతి అర్హుడికి ఏబిహెచ్ఎ ఐడి సృష్టించడం, ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య సంస్థలన్నింటిలో డిజిటల్ ఆరోగ్య సేవలను పూర్తి స్థాయిలో అమలు చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య వివరాలను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో నమోదు చేయడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అవస రమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తొలి ఏబీడీఎం మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి జిల్లా ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 4,02,949 ఏబిహెచ్ఎ ఐడిలు, 815 మంది ఆరోగ్య సేవల నిపుణుల నమోదులు, 570 ఆరోగ్య సంస్థల నమోదులు, 120 ఏబీడీఎం-సామర్థ్యమున్న ఆరోగ్య సంస్థలు, 5.50 లక్షలకు పైగా డిజిటల్ ఆరోగ్య రికార్డుల అను సంధానం , డిజిటల్ హెల్త్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద రూ. 47.23 లక్షల ప్రోత్సాహకం సాధించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య సంస్థల్లో 100 శాతం హెచ్ఎఫ్ఆర్, హెచ్పిఆర్ ధృవీకరణ, ఏబీడియం-సామర్థ్యమున్న హెచ్ఎంఐఎస్ అమలు, ఏబిహెచ్ఎ ఆధారిత రోగుల నమోదు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ల్యాబ్ నివేదికలు, డిశ్చార్జ్ సమ్మరీలు, డిజిటల్ ఆరోగ్య రికార్డుల అను సంధానం, ఆరోగ్య సిబ్బందికి నిరంతర శిక్షణ ద్వారా సామర్థ్యాభివృద్ధి మరియు విస్తృత ప్రజా అవగాహన కార్యక్రమా లు చేపట్టనున్నట్లు తెలిపారు.వర్క్‌షాప్‌లో ఇంటిగ్రేషన్, డిజిటల్ ఆరోగ్య రికార్డుల నిర్వహణ, రోగి సమ్మతి ఆధారిత డేటా షేరింగ్, డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు మరియు ఆరోగ్య సేవల డిజిటలైజేషన్‌పై నేషనల్ హెల్త్ అథారిటీ, రాష్ట్ర ఎబిడియం బృంద సభ్యులు సమగ్ర అవగాహన కల్పించారు.జిల్లాలో ఏబీడియం అమలుకు సంబంధించిన మూడు నెలల కార్యా చరణ ప్రణాళికను జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారి డా. ఎం. మనోహర్, రాష్ట్ర ఏబీడీఎం బృంద సభ్యురాలు డా. సూర్యశ్రీ రావు సమావేశంలో సమర్పించారు. ఈ కార్య క్రమం ద్వారా జిల్లాలోని అన్ని ఆరోగ్య సంస్థలు డిజిటల్ ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు వేగ వంతమైన, పారదర్శక మైన, నాణ్యమైన, నిరంతరాయ వైద్య సేవలను అందించేందుకు సిద్ధమవుతున్నట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమం అనంతరం ధన్యవాదాలు తెలియజేసి జాతీయ గీతాలాపనతో వర్క్‌షాప్ ముగిసింది. ఈ కార్యక్రమంలో విశేష కృషి చేసిన జిల్లా వైద్య & ఆరోగ్యశాఖ అధికారులు, రాష్ట్ర, జిల్లా ఏబీడీఎం బృంద సభ్యులు, ప్రోగ్రాం నిర్వాహకులు,సమన్వయ కర్తలను అభినందిస్తూ అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ అథారిటీ ప్రతినిధులు, రాష్ట్ర ఎబిడిఎం బృంద సభ్యులు, జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులు డా. రామకృష్ణ, డా. వీణ, డా. సుమన్ కళ్యాణ్, డా. వంశీకృష్ణ, నోడల్ ఆఫీసర్ డా. అశ్విన్ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రుల మెడికల్ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసు పత్రుల వైద్యులు, మేనే జింగ్ డైరెక్టర్లు, మెడికల్ సూపరింటెండెంట్లు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్ల ప్రతినిధులు , ఫార్మసీ ప్రతినిధులు, సాఫ్ట్‌వేర్ సంస్థల ప్రతి నిధులు , ఆరోగ్య సేవల నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మిర్యాలగూడ, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తో పాటు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు, దాతలు, ప్రజలు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (BLR) పిలుపునిచ్చారు. మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంప్ ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ కస్తూరి ప్రభాకర్ తల్లి కస్తూరి రాములమ్మ స్మృత్యర్థం ఏర్పాటు చేసిన స్మృతి భోజన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విద్యార్థులకు భోజనం వడ్డించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్రాంత ఉపాధ్యాయుడిగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తూ, మరోవైపు గ్రంథాలయ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కస్తూరి ప్రభాకర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు ఆయన నిర్వహిస్తున్న కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించవచ్చని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ప్రభాకర్, ప్రముఖ వైద్యులు జాడి రాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కందుకూరి సుదర్శన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాష్య, ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జానయ్య, ఇందిరా, వెంకటలక్ష్మి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నివారణకు సీసీ కెమెరాలు రక్షణ కవచం

– గరిడేపల్లి ఎస్ ఐ బి. శ్రీకాంత్ గౌడ్




గరిడేపల్లి, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : గరిడేపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి వెంట ఉన్న షాపుల యజమా నులతో గరిడేపల్లి పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సమావేశంలో ఎస్ ఐ బి. శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థల భద్రతతో పాటు ప్రజల రక్షణ దృష్ట్యా హైవేపై ఉన్న ప్రతి షాపులో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. దొంగతనాలు, చోరీలు, ప్రమాదాలు ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడం, దర్యాప్తును వేగవంతం చేయడం, ఆధారాలను సేకరించడం వంటి అంశాల్లో సీసీ కెమెరాల దృశ్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.జాతీయ రహదారిపై రోజూ వేలాది మంది ప్రయాణికులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే హైవే వెంట ఉన్న ప్రతి వ్యాపార సంస్థ యజమాని బాధ్యతగా నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు.హైవే ప్రాంతంలో నేరాల నివారణ, దొంగతనాల అరికట్టడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ఎస్ ఐ వివరించారు. సమావేశానికి హాజరైన షాపు యజమానులు పోలీసుల సూచనలను స్వాగతిస్తూ, తమ దుకాణాల్లో త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రత్యేక ఓటర్ సవరణ నమోదు (ఎస్ ఐ ఆర్) లక్ష్యం

– ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి



మిర్యాలగూడ, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రత్యేక ఓటర్ సవరణ నమోదు(ఎస్ఐఆర్) లక్ష్యం సాధించేందుకు ప్రతిఒక రాజకీయ పార్టీ సహకరించాలని ఓటర్ నమోదు అధికారి, మిర్యాలగూడ ఆర్డిఓ ఎస్. రమణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ చివరి దశకు చేరుకున్నదని సంపూర్ణమయ్యేందుకు పార్టీలు పూర్తి సహకారమివ్వాలని కోరారు. ఆగష్టు 3న ఎస్ఐఆర్ నమోదుకు చివరి తేదీ అని ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ నేతలను కోరారు. అదేవిధంగా పోలింగ్ బూత్ల ఏర్పాటుపై సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ట్రైని డిప్యూటీ కలెక్టర్ వెంకటేష్, డిఎఓ జె. శ్రీనివాస్ శర్మ, తహసీల్దార్లు పావని సరోజ, హేమలత, జవహర్, రాగ్యానాయక్, కాంగ్రెస్ నాయకులు కొర్ర నాగునాయక్, పాతూరి శరత్, సిపిఎం నాయకులు డి. మల్లేష్, బిజెపి నాయకులు కన్మతరెడ్డి అశోక్ రెడ్డి, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేని వర్షాలు.. పట్టణ ప్రజలు అప్ర మత్తంగా ఉండాలి..

– ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య.

యాదాద్రి భువనగిరి, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) : గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆలేరు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య సూచించారు.భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని చైర్మన్లు , పలు మండల పార్టీ అధ్యక్షులు స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని , అధికారుల సహాయంతో తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ప్రజల భద్రత కోసం మున్సిపల్ కమిషనర్ , కౌన్సిలర్లు , అధికారులు , సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపడు తున్నారని తెలిపారు.నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాలువల వద్ద వరద ఉధృతి అధికంగా ఉన్నందున రాకపోకలు నిలిపి వేయా లని అధికారులకు సూచించారు. వర్షాల నేపథ్యంలో పాత కాలంనాటి ఇండ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తర లించాలన్నారు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.



## గిరిజన నిరుద్యోగ యువతకు ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ...

### -ఆగస్టు 07లోగా దరఖాస్తు చేసుకోవాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్...

**భద్రాద్రి కొత్తగూడెం, (జర్నలిస్ట్ ఫైల్) :**
గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలోని వైటీసీ శిక్షణా కేంద్రంలో ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు.18 నుంచి 33 సంవత్సరాల మధ్య వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు ఈ శిక్షణ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జావా, పైథాన్, స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ సాఫ్ట్ స్కిల్స్, బ్యూటీషియన్,సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ టైలరింగ్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.శిక్షణతో పాటు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు, శిక్షణ పూర్తయిన అనంతరం ఎన్ఎస్డీసీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని వెల్లడించారు.ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 7లోపు తమ లగేజీతో నేరుగా వైటీసీ శిక్షణా కేంద్రానికి వచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 7993102529 నంబర్‌కు మెసేజ్ పంపడం ద్వారా లేదా ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు.సీట్లు పరిమితంగా ఉన్నందున అర్హులైన గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో



బి. రాహుల్ విజ్ఞప్తి చేశారు

## మీ పేరు ఎస్ఐఆర్ లో నమోదైందో లేదో ఇలా తెలుసుకోండి తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి



**మిడ్జిల్, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
మిడ్జిల్ మండల తహసిల్దార్ రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలందరు ఒకసారి మీ ఓటర్ మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అనేది తప్పకుండా చెక్ చేసుకోవాలన్నారు. మీ పేరు నమోదైందో లేదో తెలుసుకోవడానికి:ECI అని టైప్ చేసి, ఒక స్పేస్ ఇచ్చి మీ ఓటర్ ఐడి నంబర్ టైప్ చేసి 1950కి SMS పంపండి. ఉదాహరణ ECI ABC1234567 → 1950కి పంపండి.కొద్ది సేపట్లో రిప్లై మెసేజ్ వస్తుంది. దాని ద్వారా మీ మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా, ఆన్‌లైన్‌లో నమోదైందో లేదో తెలుసుకోవచ్చు. చివరి తేదీ వచ్చే వరకు వేచి ఉండకుండా, వెంటనే ఒకసారి చెక్ చేసుకోవాలని , అలాగే అంగన్వాడీ కేంద్రాల వద్ద గ్రామాల జి.పి.ఓ ,అంగన్వాడీ టీచర్లలను ఓటర్ల లకు అందరూ సహకరించాలని తెలిపారు.

## ఈ దేశంలోని యువత, విద్యార్థులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను ప్రతిఘటించండి

- యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ పిలుపు





**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్ అధ్యక్షతన జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, 20 మండలాల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్ కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయికుమార్ మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటివరకు ముందుండి పోరాడారని, ఇదే పోరాట స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.దేశంలోని యువత, విద్యార్థుల గొంతును అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు.అదేవిధంగా, విద్యార్థి-యువజన ఉద్యమాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణలోకి తీసుకుని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని వేజండ్ల సాయికుమార్ హెచ్చరించారు.యువత సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమం లో స్టేట్ సెక్రటరీ జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ లు ఖలీల్, బాల గంగాధర్, కోటేష్, ఆదర్శ్ మరియు జిల్లా జనరల్ సెక్రటరీ లు కుక్కల మహేష్, బెల్లంకొండ శరత్ ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ శ్రావణ్, జిల్లా యువజనకాంగ్రెస్ నాయకులు బోడేపూడి రాజా, కొండూరి హృదయ్ కిరణ్ మరియు అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ లు అంబటి ఈశ్వర్, నితీష్ కుమార్ సన్నీ, ఖైసర్, ఫారుక్, జంగం రాజేష్ మరియు మండల అధ్యక్షులు జనప్రియ కుమార్, రామకృష్ణ, అలకుంట నరసింహారావు, రాకేష్, సతీష్, నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కో-కో కోర్డినేటర్ పవన్ కుమార్ రాజు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి తరుణ్, దినేష్, మల్లెలి గాంధీ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**వికారాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :**
వికారాబాద్: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా అనంతగిరిలోని పద్మనాభ స్వామి దేవాలయంలో నిర్వహించిన చిన్న జాతర (పెరుగు బసంతం) కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి దేవాలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గడ్డం ప్రసాద్ కుమార్‌కు అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.తదుపరి వికారాబాద్ పట్టణంలోని దత్తాత్రేయ కాలనీలో ఉన్న దత్తాత్రేయ స్వామి దేవాలయాన్ని సందర్శించిన గడ్డం ప్రసాద్ కుమార్, గడ్డం అనన్య స్వామివారి పూజల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### : జిల్లా కలెక్టర్ అంకిత్

- జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో అధికారులకు ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం, (జర్నలిస్ట్ ఫైల్) :**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న బ్లాక్ స్పాట్ల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రహదారులపై పశువుల సంచారం అధికంగా ఉండటం వల్ల, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు . రహదారులపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అతివేగంగా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు అప్పగించడం, సీటు బెల్టులు ధరించకపోవడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 42 బ్లాక్ స్పాట్లలో భద్రతా చర్యలకు సంబంధించిన పనులను వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరికలు, సూచిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంట ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు.ప్రమాదాలు సంభవించినప్పుడు క్షతగాత్రులకు 'గోల్డెన్ అవర్'లో సకాలంలో వైద్య




సేవలు అందేలా బ్లాక్ స్పాట్లకు సమీపంలోని ఆసుపత్రులను మ్యాపింగ్ చేయాలని, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో జనవరి నుండి ఇప్పటివరకు 289 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు వేణుగోపాల్, ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వర రావు, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి అనూష సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి వేళ శాఖాంబరిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



**మంథని, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆషాడ శుద పౌర్ణమి ( గురు పౌర్ణమి ) పర్వదినము పురస్కరించుకొని బుధవారం మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ దేవాలయంలో " శాఖాంబరి" ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ ఉదయం 4 గంటలకు అమ్మవారికి అభిషేకం, 6 గంటలకు అర్చన అనంతరము శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటలకు అమ్మవారు శాఖాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటల నుండి 9 గంటల వరకు ప్రత్యేక భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పవళింపు సేవ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. దుర్గముడు అనే రాక్షసుని బారి నుండి సమస్త జీవకోటిని రక్షించుటకు శ్రీ ఆదిపరాశక్తి మాత శాఖాంబరిగా కీర్తించబడినదని శ్రీ దేవి భాగవతంలోని సప్త మస్కందములో తెలుపబడినది. ఆ దేవి అనుగ్రహించిన 9 అవతారంలలో శాకాంబరీ దేవి అవతారం ఒకటిగా పేర్కొనబడినది.

## సర్ కార్యక్రమంలో పాల్గొన్న జోగుపర్తి ప్రభాకర్ రావు

**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఖమ్మంజిల్లా అభివృద్ధి ప్రదాత పూజ్యులు పెద్దలు మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశానుసారం ఖమ్మం నగరంలో గల నాలుగోవ డివిజన్ 63 బూతులో( సర్ ) కార్యక్రమంలో భాగంగా నాలుగవ డివిజన్ బి ఆర్ ఎస్ మాజీ అధ్యక్షులు జోగుపర్తి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . బుధవారం జరిగిన కార్యక్రమంలో బిఎల్ఓ లు సుదర్శన్ రావు సమక్షంలో బిఆర్ఎస్ నాయకులు కంచర్ల దయాకర్, డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ వలి, పాల్గొన్నారు. ఓటరు రిజిస్ట్రేషన్ చేసిన వారి పేర్లు(1) ఆదూరి సింధూకిరణ్ (2) ఆరెపల్లి సావిత్రి (3) మల్లయ్య ఆరెపల్లి (4) వెంకట గణేష్ వీరి ఓటును ఆన్లైన్ చేసి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది.

## నామ తల్లిదండ్రుల స్మృతి వనాన్ని సందర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్

**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**



జమ్మూ అండ్ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం పర్యటనలో భాగంగా రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న నామ ముత్తయ్య–వరమ్మ స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులు నామ ముత్తయ్య, వరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి, నామ ముత్తయ్య–వరమ్మ జీవిత విశేషాలు, సమాజానికి అందించిన సేవల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. అక్కడ ప్రదర్శించిన అరుదైన చిత్రాలను పరిశీలించారు. ఆ గ్యాలరీ ఫోటోల విశేషాలను నామ సోదరుడు సీతయ్య వివరించారు. స్మృతివనంలో ఏర్పాటు చేసిన మొక్కలను, పరిసరాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. అనంతరం అక్కడ నుంచి హైదరాబాద్ పయనమయ్యారు.

## ప్రతి ఒక్కరూ నీటి వనరులను సంరక్షించుకోవాలి

### - ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి



**కేశంపేట, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,,భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ నీటి వనరుల సంరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించవచ్చని, రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి సాగునీటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సపూర అమేర్, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, జీపీఓ వెంకటయ్య, ఐకేపీ సీసీ పరంధాములు, వార్డు సభ్యులు లక్ష్మణ్ బాబు, నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రిజ్వానా బేగం, మోహిజ్, మంజుల, జంగేష్, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, సులోచన, వనజ, జయమణి, ఆశా కార్యకర్తలు కరుణ, పద్మ, సంగీత, వీవోఏలు గోపాల్, చిత్కళ, గ్రామ నాయకులు, రైతులు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇరాన్ తో యుద్ధంలో నైతిక ఓటమిని ట్రంప్ అంగీకరించాలి

- సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం
- కేంద్ర ప్రభుత్వం మెడలు వంచిన విద్యార్థి, యువత పోరాటం : సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్
- సీతారామ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయకపోవమే జిల్లాలో రైతులకు ఇబ్బందులు : సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఇరాన్ తో యుద్ధంలో అమెరికా నైతికంగా ఓడిపోయిందని, ఆ ఓటమిని ట్రంప్ అంగీకరించి వెంటనే ఒప్పందాలు చేసుకోవాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.స్థానిక సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని తమ్మినేని వీరభద్రం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరాన్ పెట్టిన అన్ని నిబంధనలను అమెరికా అంగీకరిస్తుందని ట్రంప్ చెబుతూ పైకి మాత్రం యుద్ధంలో తమదే పై చేయి అంటున్నారని ఆయన అన్నారు. మేకపోతు గంభీరంలా ట్రంప్ వ్యవహారం ఉందని ఆయన అన్నారు. అందుకే యుద్ధంలో నైతికంగా అమెరికా ఓటమిని అంగీకరించాలని ఆయన అన్నారు. ఇంకా యుద్ధాన్ని కొనసాగిస్తే అమెరికా ఆర్థిక పరిస్థితి చిన్న భిన్నమయ్యే అవకాశా ఉందని,ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. యుద్ధం కారణంగా మిగిలిన దేశాలు కూడా ఇబ్బంది పడుతున్నాయని ఆయన అన్నారు. అందుకే ట్రంప్ ఓటమి అంగీకరించి చర్చలకు వచ్చి యుద్ధాన్ని ముగించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ సందర్భంగా దేశంలో ముఖ్యంగా ఢిల్లీలో యువత, విద్యార్థులు కలిసి చేసిన పోరాటం విజయవంతమైందని ఆయన అన్నారు. విద్యార్థుల యువత పోరాటానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదని అన్నారు. ఈ పోరాటం ఈ విజయం చారిత్రాత్మకమైనదని ఆయన అన్నారు. ఈ పోరాట స్ఫూర్తితో బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన అన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో రైతులు ఈ సమస్య ఎదురు చూడడానికి సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయకపోవడమే కారణమని అన్నారు. సీతారాం ప్రాజెక్టు పూర్తి చేస్తుంటే రైతులకు ఖమ్మం జిల్లాలో త్రాగు, సాగునీటి సమస్య ఉండేది కాదని అందుకనే వెంటనే సీతారాం ప్రాజెక్టు పూర్తి చేయాలని అన్నారు.ఈ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్ , కళ్యాణం వెంకటేశ్వరరావు, వై విక్రమ్ భూక్య వీరభద్రం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 1న జాబ్ మేళా : జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి

### -హరేకృష్ణ చారిటీ వారిచే జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హరేకృష్ణ చారిటీ వారిచే ఆగస్టు 1న శనివారం రోజున ఉదయం 10 గంటలకు ఖమ్మం టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ (Govt. ITI) ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ATC) నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్, మెయింటెనెన్స్, మిల్క్ ప్లాంట్, క్వాలిటీ, ఐటీ, పర్చేజ్, అకౌంట్స్, ఆపరేషన్స్ విభాగాల్లో ఇన్‌చార్జ్, ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, టెక్నీషియన్, మేనేజర్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.ఐటీఐ, డిప్లొమా, బీటెక్, బీకాం, ఫుడ్ టెక్నాలజీ, కంప్యూటర్స్, హోటల్/హాస్పిటాలిటీ నేపథ్యంతో కూడిన ఏదైనా డిగ్రీ అర్హతలు కలిగి, సంబంధిత అనుభవం ఉన్న అభ్యర్థులు పోస్టును బట్టి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోస్టులను బట్టి 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి 20 వేల నుండి 80 వేల వరకు నెలవారీ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల ధృవ పత్రాల జిరాక్స్ కాపీలు తీసుకొని ఆగస్టు 1న శనివారం నాడు నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు హరే కృష్ణ చారిటీస్ హెచ్ఆర్ సెల్ నెంబర్ 9372478535ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

- పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్





**ఖమ్మం, జూలై 30 (జర్నలిస్ట్ ఫైల్) :**

జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్, అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడం పార్టీ శ్రేణుల బాధ్యత అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గురువారం పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో చేపడుతున్న '2 ఏళ్ల అభివృద్ధి--సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుటుంబ సాధికార సమితి సభ్యుల నుంచి అన్ని స్థాయిల పార్టీ నాయకుల వరకు ప్రతి ఒక్కరూ ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. రాష్ట్ర పునర్నిర్మాణ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల్లోనే తిప్పికొట్టాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గత పాలనలో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిన వైసీపీ నేతలు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను చంద్రబాబు నాయుడు గుర్తిస్తున్నారని, మై టీడీపీ యాప్ ద్వారా అసెంబ్లీ కమిటీ, క్లస్టర్ స్థాయి నుంచి సాధారణ కార్యకర్త వరకు పనితీరును అంచనా వేస్తున్నారని తెలిపారు. సమర్థంగా పనిచేసే కార్యకర్తలకు అత్యున్నత స్థాయి బాధ్యతలు కూడా దక్కే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరిలోని నిధి భవన్‌లో గురువారం పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. పాత కార్యవర్గం పదవీకాలం ముగియడంతో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అనుమతితో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా వి. సుబ్బారెడ్డి, పరిశీలకురాలిగా బి. జానకి, సహాయ ఎన్నికల అధికారిగా ఎల్. రజనీష్ బాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా జి. పూర్ణచంద్రరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్. ఎల్లా సుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా టి. బాలకృష్ణ, జి. మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శిగా సి. శ్రీధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్. బాలకృష్ణ, కార్యదర్శులుగా పి. సాంబశివరావు, డి. రత్నభారతి, కోశాధికారిగా కె. రంగనాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర కోశాధికారి ఎన్. భారతి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి పి. శివప్రసాద్, రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ కన్వీనర్ పి. సురేఖ నూతన నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా ప్రయోజనాల పరిరక్షణలో అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించగా, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఉద్యోగ సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమర్థవంతంగా పనిచేస్తుందని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆగస్టు 13వ తేదీన స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆగస్టు 13వ తేదీన జరగనున్నాయని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. వివిధ అంశాలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయుటకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జోరువానలోనూ ప్రగతిని వివరిస్తూ...

- గుంటూరు తూర్పులో పండుగలా మన ఇంటికి -మన నసీర్
- ప్రతి ప్రాంతంలో ఎమ్మెల్యే నసీర్ కు అపూర్వ స్వాగతం
- వసంతరాయపురంలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమంపై ప్రగతి నివేదిక అందించిన ఎమ్మెల్యే నసీర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇంటింటికీ రెండేళ్ల పాలన- ఇంటింటి ప్రచారంలో భారంగా స్థానిక వసంతరాయపురంలో మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమం జోరువానలోనూ కొనసాగింది. గత ఐదేళ్లలో కనీసం రోడ్లకు కూడా నోచుకోని తమ ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు తీసుకొచ్చిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు కు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. జోరు వానలోనూ ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి పాలన ప్రగతి గురించి వివరించారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఎవరికైనా సంక్షేమ పథకాలు అందడం లేదా ? ఈ ప్రాంతంలో ఏవైనా అభివృద్ధికి సంబంధించిన సమస్యలు ఉన్నాయా ? విద్యుత్, మంచి నీటి సరఫరా, శానిటేషన్ వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయా ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను పాఠశాలలకు పంపిస్తున్నారా ? తల్లికి వందనం అందరికీ అందిందా ? ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయి ? వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' పండుగలా కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో అమరావతి పునర్నిర్మాణం చేపట్టామని, పోలవరం పనుల పురోగతి సాధించామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ ద్వారా 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేశామన్నారు. దీనిపై ఆరోపణలు చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని మండిపడ్డారు. రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలలో అత్యధిక శాతం నెరవేర్చామని, సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళు న్నామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు చిట్టాబత్తిని చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, గుడిమెట్ల దయారత్నం, గోళ్ల ప్రభాకర్, ముప్పవరపు భారతి, మహంకాళి నరసింహారావు, బాబూరావు, దేవదాసు, ఇరిగి శాంసన్, తాటిమళ్ల తిరుపతిరావు, కాకర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# తెనాలి పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- రౌడీషీటర్లకు కఠిన హెచ్చరిక.. ట్రాఫిక్, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం తెనాలి 1 టౌన్, 3 టౌన్, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్లలోని రికార్డులు, పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించిన ఆయన ప్రజలకు వేగవంతమైన, పారదర్శక పోలీసు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తున్నారా అనే విషయాన్ని హెల్ప్‌డెస్క్ వద్ద స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్‌స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో మాదకద్రవ్యాల వినియోగంపై వచ్చే ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంతో విచారిస్తున్నామని, గంజాయి సహా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఎనిమిది నెలల్లో ఎన్డీపీఎస్ చట్టం కింద 450 మందిపై కేసులు నమోదు చేసి, 13 మందిపై పీడీ చట్టం అమలు చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లకు ప్రతి వారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, సంకల్పం కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 300 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు.

రౌడీషీటర్లలో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ, మార్పు రాకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, ట్రాఫిక్ సమస్యలను సమర్థవంతంగా నియంత్రించి జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

# సర్వమత సామరస్యానికి ప్రతీక నిడుముక్కల 101 దర్గా

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్
- ప్రజల సుఖశాంతులు, రాష్ట్రాభివృద్ధి కోసం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నిడుముక్కల 101 దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు
- నిడుముక్కల 101 దర్గాలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన నిడుముక్కల గ్రామంలోని 101 దర్గాల పుణ్యస్థలంలో గురువారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు..101 దర్గా ముజవర్ & ముతవల్లి హజరత్ షేక్ షబ్బీర్ భాష ఆధ్వర్యంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ దర్గాను సందర్శించి ప్రత్యేక దువాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా టీడీపీ పార్టీ ఆఫీస్ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, తాడికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ నీలాల కృష్ణారావు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ మొయిద్దీన్ 101 దర్గా ముజవర్ & ముతవల్లి, హజరత్ షేక్ షబ్బీర్ బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, నిడుముక్కలలోని 101 దర్గాలు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక విశిష్టతను సంతరించుకున్న అరుదైన పుణ్యక్షేత్రమని అన్నారు. ఈ పవిత్ర స్థలం సర్వమత సామరస్యానికి, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా దేశం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి ప్రార్థనలు చేయడం ఈ క్షేత్ర గొప్పతనానికి నిదర్శనమని చెప్పారు. ప్రజల్లో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.

రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు సంతోషంగా జీవించాలని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఇలాంటి చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో

## "డ్రగ్స్ వద్దు బిడ్డ" యాడ్ ఫిల్మ్ చిత్రీకరణ ప్రారంభం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా చైతన్యపరిచే లక్ష్యంతో రూపొందిస్తున్న "డ్రగ్స్ వద్దు బిడ్డ" థియేట్రికల్ యాడ్ ఫిల్మ్ చిత్రీకరణ గురువారం తెనాలి గాంధీచౌక్‌లో ప్రారంభమైంది. సినీ దర్శకుడు దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ లఘు చిత్రానికి గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ క్లాప్ కొట్టి ప్రారంభించగా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. సీనియర్ సినీ నటుడు నరసింహరాజు పాల్గొన్న తొలి సన్నివేశంతో చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో విస్తృత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల విక్రయం, కొనుగోలు, వినియోగం, నిల్వ, రవాణా, సరఫరా వంటి నేరాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ఎనిమిది నెలల్లో డ్రగ్స్ సంబంధిత కేసుల్లో సుమారు 450 మందిపై చర్యలు తీసుకున్నామని, జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న "సంకల్పం" కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు సుమారు 75 వేల మంది విద్యార్థులకు డ్రగ్స్ దుష్పరిణామాలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. డ్రగ్స్ యువత భవిష్యత్తుతో పాటు కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయని పేర్కొంటూ, ఈ సందేశాత్మక యాడ్ ఫిల్మ్‌ను ప్రజలు ఆదరించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెనాలి ఆర్డీఓ శ్రీరమణి, సహాయ కమిషనర్ రామారావు, సీఐలు సీహెచ్. రాంబాబు, డి. రవీంద్రబాబు, ఎస్. సాంబశివరావు, షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## విక్టోరియా కళాశాలలో మహిళా భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ దుష్పరిణామాలపై విద్యార్థినుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు గురువారం నల్లపాడులోని విక్టోరియా కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు, సౌత్ డీఎస్పీ పర్యవేక్షణలో 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా నల్లపాడు సీఐ, ఎస్ఐ మధుపవన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు తమ భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. మహిళలపై జరిగే నేరాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల నుంచి ఎలా రక్షించుకోవాలి, పోలీసుల సహాయాన్ని ఎలా పొందాలనే అంశాలను వివరించారు. అలాగే మహిళా రక్షణ చట్టాలు, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

ఆపద సమయంలో భయపడకుండా వెంటనే 112 లేదా 100కు కాల్ చేయాలని, శక్తి యాప్ ద్వారా కూడా పోలీసులను సంప్రదించవచ్చని సూచించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా వాటిని దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ కార్యక్రమం



బ్రహ్మంగారమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):గ్రామస్థాయి అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించుటకు మంచి గ్రామస్థాయి ప్రణాళిక సిద్ధం చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు సి. వీరనారాయణరెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో భాగంగా శిక్షణ కార్యక్రమము 30. 7. 2026వ తేదీన మండల పరిషత్ కార్యాలయ సభా భవనము బి మఠం నందు నిర్వహించడం జరిగినది. ఈ సమావేశమునకు మండల పరిషత్ అధ్యక్షులు సి. వీరనారాయణరెడ్డి అధ్యక్షత వహించడం జరిగింది. సదరు సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి పరిపాలన అధికారి ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి ( గ్రామపంచాయతీలు) ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి( జి. ఎస్. డబ్ల్యూ. ఎస్), మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు మండల స్థాయి అధికారులు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయితీ కార్యదర్శులు డిజిటల్ సహాయకులు ఇంజనీరింగ్ సహాయకులు మరియు వి. ఒ. ఎ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఎల్‌నినో ప్రభావాన్ని అవకాశంగా మలుచుకోవాలి

- ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి
- సంప్రదాయ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- సాగు చేస్తున్న ప్రతి రైతు పంటల బీమా పథకంలో తప్పనిసరిగా చేరాలి

**జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ**



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న పరిస్థితుల్లో రైతులు ప్రస్తుత పరిస్థితులను సంక్షోభంగా భావించకుండా, ఒక అవకాశంగా మలచుకోవాలని జిల్లాలోని రైతులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

గురువారం కలెక్టరేట్ లోని వి సి హాల్లో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటరత్నం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి లతో కలిసి పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వ్యవసాయం, తక్కువ పెట్టుబడితో కూడిన సాగు విధానాల వైపు రైతులు మళ్లాలని ఆయన కోరారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారాన్ని కాపాడటంతో పాటు సాగు వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, తద్వారా రైతులు దీర్ఘకాలంలో ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. భూసారం , నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పంటల సాగులో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

అలాగే వర్షపాతం, నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడకుండా, తక్కువ నీటితో సాగు చేయగల ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం తదితర కారణాలతో పంటలకు నష్టం వాటిల్లినప్పుడు రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పంటల బీమా పథకం ఎంతో కీలకమన్న కలెక్టర్, జిల్లాలో పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు పంటల బీమా పథకంలో చేరాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే ప్రతికూల వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, వాతావరణ సమాచారం, పంటల ఎంపిక, పంట బీమా తదితర అంశాలపై సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధం గా ఉంటారని, రైతులకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

ఎల్‌నినో ప్రభావంతో ఎదురవుతున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలు మరియు ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రవీంద్ర బాబు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## చేనేత సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి : బీజేపీ పిలుపు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 5న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న చేనేత సమ్మేళనంను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం గుంటూరులోని వాజ్‌పేయి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కళాకారులు, కార్మికులు, చేనేత సంఘాల నాయకులు, కుల పెద్దలు, మహిళలు, విద్యార్థులు, మేధావులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని చేనేతకు అండగా నిలవాలని కోరారు. ఉదయం 8 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి భారీ శోభాయాత్ర ప్రారంభమై తుమ్మలపల్లి కళాక్షేత్రానికి చేరుకుంటుందని తెలిపారు. సమ్మేళనంలో చేనేత రంగ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాల విస్తరణ, సంప్రదాయ చేనేత కళల పరిరక్షణ, కొత్త మార్కెట్ అవకాశాలపై చర్చలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే చేనేత మహనీయుల సేవలు, చరిత్ర, చేనేత ఉత్పత్తులు, స్వదేశీ వస్తువులు, చేనేత సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. “మన చేనేత -- మన ఆత్మగౌరవం, మన వారసత్వం -- మన భవిష్యత్తు” అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ సమ్మేళనం చేనేత రంగానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా గుంటూరు జిల్లా అధ్యక్షుడు తురకా రామారావు, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి భీమినేని చంద్రశేఖరరావు, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వరరావు, హేమసుందర్, జూపల్లి ఆదిత్య, భీమవరపు రమేష్, ధవలేశ్వరం వెంకటరమణ, పల్లపు విజయ్‌కుమార్, కసినబోయిన శ్రీనివాసరావు, అనూష, షేక్ సాంబశివరావు, మల్లె గోపి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడో దశ ఆందోళనలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీఎస్ఆర్టీసీలో విద్యుత్ బస్సుల నిర్వహణ పేరుతో ప్రైవేటు ఆపరేటర్లకు అవకాశాలు కల్పించడం ద్వారా సంస్థను దశలవారీగా ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ మూడో దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించింది. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు వివరాలు వెల్లడించారు. ఇప్పటికే నాలుగు డిపోలను పూర్తిగా ఖాళీ చేసి ప్రైవేటు విద్యుత్ బస్సు ఆపరేటర్లకు అప్పగించారని, మరో ఎనిమిది డిపోల్లో సగం స్థలాలను వారికి కేటాయిస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో 1,450 విద్యుత్ బస్సుల కోసం మరో 29 డిపోలను కూడా ప్రైవేటు ఆపరేటర్లకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూసివేసిన విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలను వెంటనే పునఃప్రారంభించాలని, విద్యుత్ బస్సులను ప్రైవేటు టెండర్ల ద్వారా కాకుండా ఆర్టీసీయే కొనుగోలు చేసి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళనల భాగంగా ఆగస్టు 3న ఉద్యోగుల సంతకాలతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్ల ద్వారా ముఖ్యమంత్రికి అందజేయడం, ఆగస్టు 7, 8 తేదీల్లో వివిధ ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల మద్దతు కోరడం, ఆగస్టు 17, 18 తేదీల్లో అన్ని డిపోలు, యూనిట్లలో నల్ల బ్యాడ్జీలతో సామూహిక రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం, ఆగస్టు 28న అన్ని జిల్లాల డీపీటీఓ కార్యాలయాల వద్ద మహాధర్నాలు చేపట్టడం, సెప్టెంబర్ 3న నాలుగో దశ ఉద్యమ కార్యాచరణను విజయవాడలో ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమంలో అన్ని ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు భాగస్వామ్యం కావాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు.

## నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయంప్రతిపత్తి) రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా 3150 న్యూ జనరేషన్స్ చైర్ అన్నె రత్న ప్రభాకర్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. రోటరాక్ట్ ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందుతాయని, సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ గవర్నర్ గాజుల శ్రీనివాస్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు పి. నిరంజన్ గుప్తా, రోటరాక్ట్ చైర్ అందే మురళి, ప్రగడ రాజశేఖర్, జోనల్ రోటరాక్ట్ ప్రతినిధి నవ్య రెడ్డి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన కార్యవర్గంలో సిహెచ్. నాగేశ్వరరావు అధ్యక్షుడిగా, పి. నివేదిత స్ఫూర్తి కార్యదర్శిగా, ఎం. రవి కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. నరేష్ బాబు రేఖా మాట్లాడుతూ రోటరాక్ట్ క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి కళాశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గత కార్యవర్గ సభ్యులు కేదారేశ్వరి లక్ష్మి, బి. సంజన, చి. కార్తికేయ శ్రీరామ్ గత ఏడాది నిర్వహించిన సేవా కార్యక్రమాలకు అభినందనలు అందుకోగా, నూతన కార్యవర్గం సమాజ సేవ, యువత అభివృద్ధి, ఆరోగ్య అవగాహన, పర్యావరణ పరిరక్షణ, మానవతా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని ప్రతిజ్ఞ చేసింది.

# ‘భోగాపురం బాబు విజన్.. వైకాపాది జగన్నాటకం’

- ప్రాజెక్టును ఐదేళ్లు అడ్డుకుని ఇప్పుడు క్రెడిట్ కోసం దుష్ప్రచారం
- మంత్రి సత్యకుమార్ యాదవ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును ఐదేళ్లపాటు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుని, ఇప్పుడు అదే ప్రాజెక్టుపై క్రెడిట్ కోసం వైసీపీ దుష్ప్రచారానికి దిగడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ప్రాజెక్టు శరవేగంగా పూర్తవుతుండగా వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు.

గురువారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ, 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి రూపకల్పన చేసి భూసేకరణ పూర్తి చేయడంతో పాటు కేంద్రం నుంచి అవసరమైన పర్యావరణ, విమానయాన అనుమతులు సాధించారని పేర్కొన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నిలిపివేసి కోర్టు వివాదాల్లోకి నెట్టిందని ఆరోపించారు. దీంతో ఐదేళ్ల విలువైన సమయం వృథా కావడంతో పాటు ప్రాజెక్టు పరిమాణం కూడా కుదించబడిందని విమర్శించారు.

ఆ సమయంలో పనులు నిలిపివేయకుండా కొనసాగించి ఉంటే భోగాపురం విమానాశ్రయం మూడేళ్ల క్రితమే ప్రజలకు అందుబాటులోకి వచ్చేదని సత్యకుమార్ అన్నారు. అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేసే సామర్థ్యం లేకపోయినా, ఇతరులు నిర్మించిన ప్రాజెక్టులకు తమ ముద్ర వేయడం వైసీపీ నాయకులకు అలవాటుగా మారిందని వ్యాఖ్యానించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమీక్షలు నిర్వహించి నిలిచిపోయిన పనులను వేగవంతం చేశారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో భోగాపురం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఈ విమానాశ్రయం గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. వీడియోలు కత్తిరించి ప్రచారం చేసినా, అబద్ధాలు పదేపదే చెప్పినా చరిత్ర మారదని మంత్రి స్పష్టం చేశారు. భోగాపురం ప్రాజెక్టును ఎవరు ప్రారంభించారు, ఎవరు ఐదేళ్లు నిలిపివేశారు, ఎవరు తిరిగి వేగవంతం చేసి పూర్తి చేస్తున్నారో ఉత్తరాంధ్ర ప్రజలకు తెలుసని అన్నారు. శంకుస్థాపనలకే పరిమితమైన వైసీపీకి అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, ప్రజలు వాస్తవాలను గుర్తుంచుకుంటారని సత్యకుమార్ పేర్కొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ సభను చారిత్రాత్మక విజయంగా నిలపాలి

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**గజపతినగరం(జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభను చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ఆయన, రాష్ట్ర మంత్రి, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయ ప్రారంభోత్సవానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించి, ప్రతి మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రవాణా, జనసమీకరణ, సభా నిర్వహణ, స్థానిక నాయకులతో సమన్వయంపై మార్గదర్శకాలు ఇచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి కొత్త దిశను చూపే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అని, పారిశ్రామిక, పర్యాటక, వాణిజ్య రంగాలతో పాటు మామిడి, మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు కార్గో సదుపాయం, బీచ్ కారిడార్ అభివృద్ధికి ఇది ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి సుమారు మూడు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున రవాణా, భద్రత, పార్కింగ్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఆగస్టు మధ్య నుంచి పూర్తి స్థాయి వాణిజ్య విమాన సేవలు ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని పేర్కొంటూ, ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయడం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆర్థిక శాఖకు ఏపీఎన్‌జీజీవో'స్, ఏపీజేఏసీ వినతి

- సీపీఎస్--ఓపీఎస్ మార్గదర్శకాలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపు సహా పలు అంశాల ప్రస్తావన



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీఎన్‌జీజీవో'స్ అసోసియేషన్, ఏపీజేఏసీ ప్రతినిధులు వెలగపూడి సచివాలయంలో ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఏపీఎన్‌జీజీవో'స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, ఏపీజేఏసీ సెక్రటరీ జనరల్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్, ఏపీఎన్‌జీజీవో'స్ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఉద్యోగులకు సంబంధించిన పలు కీలక అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

మెమో-57 ప్రకారం సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారిన ఉద్యోగులకు మార్గదర్శకాలు వెంటనే జారీ చేసి అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. జిల్లా పరిషత్, ఇతర స్థానిక సంస్థల ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ నిల్వలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రెసిడెన్షియల్ ఆర్డర్--2025 అమలులో వివిధ శాఖల్లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర క్యాడర్ తదితర పోస్టులపై అమల్లో ఉన్న ఫ్రీజింగ్ ఆర్డర్లను ఎత్తివేయాలని కోరారు. మార్కాపురం, పోలవరం, మదనపల్లి జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్‌ఆర్‌ఏ అమలు చేయాలని కూడా వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునే దిశగా సానుకూలంగా స్పందించినట్లు గౌతమ్ అల్లాడి హామీ ఇచ్చారని సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఏపీఎన్‌జీజీవో'స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గుంటూరు జిల్లా, క్యాపిటల్ సిటీ యూనిట్, అమరావతి, విజయవాడ నగర శాఖల నాయకులు పాల్గొన్నారు.

## పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో గ్రామీణ అభివృద్ధి : మంత్రి సవిత

**పెనుకొండ :** పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఆర్థికాభివృద్ధితో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో కియా, కూటమి ప్రభుత్వం మధ్య రూ. 12 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఐటీఐ కళాశాల భవన నిర్మాణానికి ఒప్పందం కుదిరిందని, త్వరలో భూమిపూజ చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి కళాశాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. కియా పరిశ్రమకు అవసరమైన నైపుణ్యం కలిగిన సాంకేతిక సిబ్బందిని తయారు చేయడంలో ఈ ఐటీఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే కియా, బెల్ సంస్థల నుంచి సమీకరించిన రూ. 36 కోట్ల సీఎస్ఆర్ నిధులతో రోడ్లు, సీసీ డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రి భవనాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు వంటి మౌలిక వసతుల పనులు చేపడుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషితో రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి పరిశ్రమలు విస్తృతంగా వస్తున్నాయని, కియా పరిశ్రమ ద్వారా ప్రభుత్వానికి ఏటా సుమారు రూ. 3,600 కోట్ల జీఎస్టీ ఆదాయం లభిస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు.

## సంస్థాగత బలోపేతమే బీజేపీ విజయానికి పునాది



- గాజువాకలో బీజేపీ సంస్థాగత సమావేశం.. కార్యకర్తలకు దిశానిర్దేశం

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జాతీయ కార్యదర్శి రీతురాజ్ సిన్హా పిలుపునిచ్చారు. గురువారం విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గంలో నిర్వహించిన సంస్థాగత సమావేశానికి ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రీతురాజ్ సిన్హా మాట్లాడుతూ, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని గ్రామ, బూత్ స్థాయిలో మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ విస్తరణ, బూత్ కమిటీల బలోపేతం, రానున్న పార్టీ కార్యక్రమాల అమలు, కార్యకర్తల బాధ్యతలపై సమగ్రంగా దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందేందుకు సేవాభావంతో పనిచేయాలని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సంస్థాగత బలమే భారతీయ జనతా పార్టీ విజయానికి మూలాధారమని పేర్కొంటూ, ప్రతి బూత్‌ను బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేలా సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్థాగత సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై స్పందిస్తూ పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని పటిష్ఠం చేయాలని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో హడావుడి వద్దు

- ఏపీజేఏసీ అమరావతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలుకు కేంద్ర ప్రభుత్వం 27 నెలల గడువు కల్పించిన నేపథ్యంలో, జాబ్ క్యాలెండర్ పేరుతో హడావుడిగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఏపీజేఏసీ అమరావతి ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు ప్రక్రియను చట్టబద్ధంగా, సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని, లేకపోతే ప్రస్తుతం ప్రభుత్వ సేవలో ఉన్న ఉద్యోగులతో పాటు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే యువత కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆ సంఘం చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు సంబంధించి పదోన్నతులు పూర్తిగా నిలిపివేయాలని ఎక్కడా చట్టబద్ధ నిబంధనలు లేవని, అయినప్పటికీ ఆర్థిక శాఖ మెమో ఆధారంగా జూలై 13 నుంచి పదోన్నతులు, బదిలీలు నిలిపివేయడం చట్టవిరుద్ధమని అభిప్రాయపడ్డారు. అనేక శాఖల్లో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, కేడర్ బలం, సీనియారిటీ వంటి సమస్యలు పరిష్కారం కాకుండానే అమలు ప్రక్రియను వేగవంతం చేయడం వల్ల ఉద్యోగుల సేవా హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాన్ పేరుతో కారుణ్య నియామకాలను కూడా నిలిపివేయడం బాధాకరమని, కారుణ్య నియామకం అనేది మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ చర్య అని పేర్కొన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల పరిధిలోకి రాని రాష్ట్రస్థాయి కేడర్లలో పదోన్నతులు, బదిలీలు కొనసాగించాలని, అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్ ప్యానెల్లను సేవా నియమావళి ప్రకారం ఆగస్టు 31లోపు ఖరారు చేసి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. శాఖల వారీగా ఉన్న సమస్యలను ఆయా శాఖాధిపతులు, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో చర్చించి సమగ్ర కార్యాచరణ రూపొందించిన తర్వాతే రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయాలని సూచించారు. ఉద్యోగుల చట్టబద్ధ హక్కులు, కారుణ్య నియామకాలు, సీనియారిటీ, ఇతర సేవా అంశాలకు భంగం కలగకుండా రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు, ఉద్యోగ నియామకాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఏపీజేఏసీ అమరావతి విజ్ఞప్తి చేసింది...

## మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ పోస్టర్ ను షాడోస్ మరియు వెట్టి చాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ తయారు చేసింది. మానవ అక్రమ రవాణా నిరోధక అవగాహన కార్యక్రమం ఎంతో అవసరం అన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎ. గాయత్రి దేవి, షాడోస్ మరియు వెట్టి చాకిరి విమోచన కోయిలేషన్ సంస్థ ప్రతినిధులు ఏ. రాజ సాల్మన్, భాగ్యలక్ష్మి, అలేఖ్య, పావని, డిబిఆర్సి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి : బీజేపీ మాధవ్






- పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి
- పెందుర్తి సంస్థాగత సమావేశంలో బీజేపీ మాధవ్ పిలుపు

**అనకాపల్లి, (జర్నలిస్ట్ ఫైల్):** పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసి రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశం సబ్బవరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంస్థాగత మంత్రి మధుకర్ జీతో కలిసి ఆయన పాల్గొన్నారు.

సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి నిర్మాణం, రాబోయే కార్యక్రమాల కార్యాచరణ, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ప్రధాని సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు.

పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, పార్టీని గ్రామ, బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలకు చేరువై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణమే కీలకమని, సమన్వయంతో పనిచేస్తే రానున్న ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించగలమని అన్నారు. ఆగస్టు 1న జరిగే ప్రధానమంత్రి పర్యటనను విజయవంతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

మధుకర్ జీ మాట్లాడుతూ, బీజేపీ బలం కార్యకర్తలేనని పేర్కొన్నారు. బూత్ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, సభ్యత్వ విస్తరణ, పార్టీ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ సేవాభావంతో పనిచేస్తే పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467